నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 9 జూన్ 2025 | NIZAMABAD

## మాగంటి గోపీనాథ్ మృతిపై జీవన్‌రెడ్డి దిగ్భ్రాంతి


ఖలీల్‌వాడి, జూన్ 8 : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపినాథ్ చేసిన కృషిని కొనియాడారు. యువజన నేతగా, సినీ నిర్మాతగా సాధించిన విజయాలను గుర్తు చేసుకున్న జీవన్‌రెడ్డి.. మాగంటి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



కామారెడ్డి జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్లో కొనుగోలుదారుల సందడి

### భంగపాటే మిగిలింది..

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా, ఉమ్మడి జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కొనసాగుతున్నారు. 1999లో మొదటిసారి సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004, 2009లోనూ వరుసగా బోధన్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2014లో బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. 2018లోనూ షకీల్‌పై విజయం సాధించలేక చతికిలబడ్డారు. 2023లో బొటాబొటిన 3,062 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం కైవసం చేసుకున్నారు. మాజీ మంత్రిగా పని చేసిన అనుభవం ఉండడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పేరుంది. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రిగా అవకాశం దక్కించుకున్న రేవంత్ రెడ్డికి సుదర్శన్ రెడ్డి అత్యంత సమీప బంధువు. పీసీసీ చీఫ్‌గా పని చేసిన సమయంలో కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు భారీగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డికి బోధన్ ఎమ్మెల్యే బహిరంగంగానే సపోర్ట్‌గా నిలిచారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డికి మద్దతుగా నిలవడం, సీఎంకు బంధువు కావడంతో బోధన్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమనే ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. 18 నెలల నుంచి ఎక్కడ చూసినా ఇదే మాట వినిపించింది. ఒక దశలో హోంమంత్రి పోర్ట్‌ఫోలియో కూడా నిర్ణయం అయిపోయిందని సుదర్శన్ రెడ్డి సన్నిహిత వర్గాలు చెప్పుకున్నాయి. చివరికి భంగపాటు మాత్రమే మిగిలింది. మంత్రి వర్గ విస్తరణ వాయిదా పడడం, చివరికి ఖాయమైన క్యాబినెట్ కూర్పులో పేరు లేకపోవడంతో బోధన్ ఎమ్మెల్యే తీవ్రంగా నొచ్చుకున్నట్లుగా తెలుస్తోంది.





## మృగశిర కార్తె..

### కిటకిటలాడిన చేపల మార్కెట్లు



భీమ్‌గల్ మండలం మెండోరాలో చేపల కొనుగోళ్లు

మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం ఉమ్మడి జిల్లాలో చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. చేపల విక్రయాలు జోరుగా కొనసాగాయి. మృగశిర కార్తె సందర్భంగా ప్రజలు బెల్లంలో ఇంగువ కలుపుకొని ప్రసాదంలా తీసుకుంటారు. వేసవి ముగిశాక చలిని తట్టుకునేందుకు కార్తె రోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తున్నది. చేపలు తింటే కొన్ని వ్యాధులు దూరమవుతాయని, ఆరోగ్యంగా ఉంటామని ప్రజలు నమ్ముతారు. అందువల్ల మిర్గం రోజుల చేపలు విక్రయాలు జోరుగా జరుగుతాయి. ఉదయం 6 గంటల నుంచే వ్యాపారులు వివిధ రకాల చేపలను ప్రజలకు అందుబాటులో ఉంచారు.

–నమస్తే తెలంగాణ యంత్రాగం, జూన్ 8

# కల చెదిరింది!

- మంత్రివర్గ విస్తరణలో దక్కని చోటు
- సుదర్శన్ రెడ్డికి మరోసారి మొండి‘చేయి’
- చర్చనీయాంశంగా మారిన క్యాబినెట్ కూర్పు
- ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వని సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలోనే ఉమ్మడి జిల్లా పాలన

నిజామాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాకు నిరాశే ఎదురయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలవుతుండగా..మంత్రివర్గంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి ఎవరికీ చోటు దక్కలేదు. ఆదివారం జరిగిన మంత్రి వర్గ విస్తరణలో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రి యోగం దక్కింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటి నుంచి ఇంతవరకూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో

### పెద్దాయనకు భంగపాటు

ఒక్కరికీ చోటు దక్కలేదు. క్యాబినెట్ కూర్పులో భాగంగా తప్పకుండా ఎవరికో ఒకరికి మంత్రియోగం పట్టుకుంటుందని అంతా ఆశించారు. కానీ అందుకు భిన్నంగా పరిస్థితులు వెలుగు చూశాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌కు మంత్రి పదవిని కట్టబెట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో ఎమ్మెల్యేను మంత్రి చేశారు. సీఎం సొంత జిల్లాకు ముచ్చటగా మూడో మంత్రి వచ్చాడు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు కనీసం ప్రాతినిధ్యం కరువైంది. సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఖాయమన్నట్లుగా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అసలు ఏం జరిగిందో ఆదివారం తెల్లారే సరికి ఆ ఊసే లేకుండా పోయింది. కొత్త ఎమ్మెల్యేలకు చోటు దక్కలేదు. 18 నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్న క్యాబినెట్ బెర్త్ వేరే జిల్లాలకు వెళ్లడంతో ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ నేతలంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

### ఉమ్మడి జిల్లాపై నిర్లక్ష్యం

నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ రేవంత్ క్యాబినెట్‌లో ఉమ్మడి జిల్లాకు చోటు లేకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి రాజుకుంటున్నది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ, ఉమ్మడి జిల్లా పరిపాలనలో ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు. ఉభయ జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలతో సమన్వయం చేసుకుంటూ పాలనను గాడిలో పెట్టడానికి మంత్రి అత్యవసరం. ఉమ్మడి జిల్లాకు అమాత్యుడు లేకపోవడంతో వెలితి కనిపిస్తున్నది. ఫలితంగా పాలనా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయి. మంత్రివర్గ విస్తరణలో తనకే పదవి వరిస్తుందని జోరుగా ఉమ్మడి జిల్లా సమీక్షలు, సమావేశాలను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిర్వహించారు. క్యాబినెట్ ర్యాంక్‌తో కూడిన ప్రొటోకాల్‌ను అనధికారికంగా పొందారు. మంత్రి యోగం కలుగకపోవడంతో సమీక్ష లు, సమావేశాలకు దూరంగా ఉంటు న్నారు. ఇవే చివరి ఎన్నికలంటూ బోధన్‌లో గత అసెంబ్లీ పోరులో ప్రచారం చేసిన సుదర్శన్ రెడ్డికి పోటీగా మంత్రి పదవి రేసులో కొత్త ఎమ్మెల్యేలు సైతం పైరవీలు చేశారు. నలుగురు ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరికీ మంత్రి యోగం దక్కకపోవడంపై నిట్టూరుస్తున్నారు. ఇదేం తీరు అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. పలువురు ఎమ్మెల్యేల అనుచరులు, ఉమ్మడి జిల్లా ప్రజలు బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీరుపై మండిపడుతున్నారు.

### మంత్రి వర్గంలో స్థానం దక్కకపోవడంతో
## సుదర్శన్‌రెడ్డి అసంతృప్తి!

- ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు సిద్ధమైనట్లు మొదట్లో సోషల్ మీడియాలో వైరల్
- ఆయన ఇంటికివెళ్లి బుజ్జగించిన అగ్రనేతలు
- చివరికి అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని సుదర్శన్‌రెడ్డి ప్రకటన

బోధన్, జూన్ 8: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తనకు స్థానం దక్కకపోవడంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో తనకు స్థానం దక్కుతుందని సుదర్శన్‌రెడ్డి మొదటి నుంచీ ఆశించారు. జిల్లాలో ఆయన అనుచరులు కూడా అదే ప్రచారం చేశారు. ఆదివారం ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవుల్లో తనకు చోటు దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఒక దశలో నిర్ణయించుకున్నట్లు కొన్ని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. సుదర్శన్‌రెడ్డి అసంతృప్తి విషయం బయటికి పొక్కడంతో ఆయనను బుజ్జగించేందుకు ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి స్వయంగా వెళ్లారు. ఆమె వెంట పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, వేం నరేందర్ రెడ్డి, పొన్నం లక్ష్మయ్య మరికొందరు నేతలు ఉన్నారు. ఎటువంటి తీవ్రమైన నిర్ణయం తీసుకోరాదని, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ సముచిత స్థానం ఉంటుందని సుదర్శన్‌రెడ్డికి మీనాక్షి నటరాజన్ నచ్చజెప్పినట్లు తెలిసింది. కాగా, తాను అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని సుదర్శన్‌రెడ్డి తను అనుచరులతో స్పష్టంచేశారు.

## తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

మాక్లూర్ జూన్ 8: తండ్రి మందలించడంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నది. నిర్మల్ జిల్లా నర్సాపురం గ్రామానికి చెందిన సిందే శివకుమార్ (17) నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సెకండ్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు, థర్డ్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు, ఫోర్త్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ కాగా.. శ్రద్ధగా చదువుకోవాలని తండ్రి మందలించాడు. సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి శివకుమార్ వారం రోజుల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఈ నెల 6వ తేదీన మధ్యాహ్నం హాస్టల్ నుంచి దాస్‌నగర్ గ్రామశివారులోకి వెళ్లి గడ్డి మందు తాగాడు. అక్కడి నుంచి తిరిగి హాస్టల్‌కు వెళ్లి వాంతులు చేసుకోవడంతో గమనించిన స్నేహితులు వెంటనే దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఈ నెలాఖరు వరకు
## రేషన్ బియ్యం పంపిణీ



### డీఎస్‌వో అరవింద్‌రెడ్డి

కంఠేశ్వర్, జూన్ 8 : జిల్లాలో ఈ నెలాఖరు వరకూ రేషన్ బియ్యం పంపిణీ చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతినెలా 15 వరకు మాత్రమే రేషన్ సరుకుల పంపిణీ చేపట్టగా.. ఈసారి 30 వరకు పొడిగించినట్లు తెలిపారు. మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో నెలకొన్న జాప్యాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని సూచించారు.

## నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం



మోర్తాడ్, జూన్ 8: ఎగువప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో మూడునాలుగు రోజులుగా నీటిమట్టం నిలకడగా ఉన్నది. ఆదివారం ప్రాజెక్ట్‌లోకి 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.30 అడుగుల (12.904టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

## పచ్చని చెట్లు ..పశువుల పాలు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఇందులో విరివిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పల్లె ప్రకృతి వనాల నిర్వహణపై నిర్లక్ష్యం నెలకొన్నది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఏపుగా పచ్చగా పెరిగిన మొక్కలు, చెట్లు పశువులకు ఆహారంగా మారుతున్నాయి. మాక్లూర్ మండలం రాంపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం అధ్వానంగా మారింది. మొక్కలు, చెట్ల రక్షణ కోసం చుట్టూ కనీసం కంచె ఏర్పాటు చేయలేదు. బోర్డు ఏర్పాటు చేసినా వాటిపై పేర్లు కనిపించకుండాపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

### గుర్తుతెలియని వాహనం ఢీకొని
## ఎలుగుబంటి మృతి

ఇందల్వాయి, జూన్ 8 : ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ ఎలుగుబంటి మృతి చెందినట్లు ఎఫ్ఆర్వో రవిమోహన్ భట్ తెలిపారు. ఎలుగు బంటి శనివారం రాత్రి జాతీయ రహదారి దాటుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నదని పేర్కొన్నారు. ఎలుగుబంటికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.



వాహనం ఢీకొని మృతి చెందిన ఎలుగుబంటి



సీపీ ఆదేశాల మేరకు సమాజ సేవలో పాల్గొన్న మైనర్

వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లతో సామాజిక సేవ

## ‘మైనర్ డ్రైవింగ్’పై పోలీసుల ప్రత్యేక దృష్టి

వినాయక్‌నగర్, జూన్ 8: జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పట్టుబడుతున్నారు. మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించినా కొందరిలో మార్పురావడంలేదు. మైనర్లు వాహనాలు నడపడంవల్ల వారితోపాటు ఎదుటి వ్యక్తులకు సైతం హాని జరుగుతున్నది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన సీపీ సాయి చైతన్య .. మైనర్ డ్రైవింగ్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. అవగాహనలో భాగంగా సామాజిక సేవ చేయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన జంక్షన్స్ (సిగ్నల్ పాయింట్స్)వద్ద పట్టుబడిన మైనర్లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామాజిక సేవ చేయిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు బ్రేక్ ఇస్తున్నారు. మైనర్స్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, మైనర్లు వాహనం నడపడంవల్ల మనతోపాటు ఎదుటి వ్యక్తులకు సైతం హాని కలుగుతుందని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే ప్రాణహాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొంటూ రూపొందించిన ప్లకార్డులను చేతుల్లో పట్టుకుని అవగాహన (సామాజిక సేవ) కల్పిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐదు ప్రధాన కూడళ్ల వద్ద పలువురు మైనర్లు ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణలో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.